# కంచెలో ఇరుక్కున్న దుప్పిని కాపాడిన గ్రామస్తులు

నందలూరు, మార్చి 27: ప్రభాతవార్త:



మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని ఇసుకపల్లె ప్రాథమిక పాఠశాల సమీపంలోని పొలాల్లో గురువారం రాత్రి ఓ దుప్పి కంచెలో ఇరుక్కుపోయింది. బయటపడేందుకు చేసిన ప్రయత్నంలో దుప్పి గాయపడింది. శుక్రవారం ఉదయం గమనించిన గ్రామస్తులు దుప్పిని సురక్షితంగా కంచె నుంచి బయటకు తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ సిబ్బంది దుప్పికి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రాజంపేటకు తరలించారు.


వైఎస్ఆర్



కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

శనివారం 28 మార్చి 2026


# సౌమ్యనాథుని సన్నిధిలో గుంతకల్ డిఆర్ఎం

నందలూరు, మార్చి 27 ప్రభాతవార్త :



గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా దంపతులు శుక్రవారం శ్రీ సౌమ్యనాథ స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సునీల్, సాయి కృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించి తీర్థప్రసాదాలు అందజేసి పూలమాల, శాలువాతో సత్కరించారు. తరువాత రైల్వే స్టేషన్‌కు చేరుకున్న డిఆర్ఎంను రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సమస్యలను విన్న డిఆర్ఎం వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డివోఎం శ్రావణ్ కుమార్, సీనియర్ డిఈఎన్ సుదర్శన్ రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కే.రాజగోపాల్ రెడ్డి, డిఆర్‌ఉసిసి మెంబర్ తళ్లెం భరత్ కుమార్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఆర్పీఎఫ్ ఎస్ఐ త్రివేణి, జీఆర్పీ ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

# అంతా రామమయం...



## ఒంటిమిట్టలో వైభవంగా ధ్వజారోహణం

## భక్తులతో పోటెత్తిన కోదండ రామాలయం

## శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీరామచంద్రమూర్తి

ఒంటిమిట్ట, మార్చి 27 ప్రభాతవార్త :

ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో శ్రీరామచంద్రమూర్తిని అర్చకులు మేలుకొలిపారు. సీతారామ లక్ష్మణ మూలవరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సర్వదర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి జగతి రాముడి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. అనంతరం అత్యంత వైభవంగా జరిగిన ధ్వజారోహణం ఘట్టం చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్టించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోల్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవ కలశ పంచామృతాభిషేకం చేశారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. ధ్వజారోహణం సందర్భంగా ధ్వజస్తంభం చుట్టూ వివిధ రకాల పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. తెల్లవారుజామునే తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు దంపతులు శ్రీరామచంద్రమూర్తికి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం పురస్కరించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజుకు వేద ఆశీర్వచనం చేశారు. రాత్రి శ్రీరామచంద్రమూర్తి శేష వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామనవమి వేడుకలకు వచ్చే భక్తుల కోసం టిటిడి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. స్వామి ప్రసాదం తో పాటు వడపప్పు, పానకం ,అన్న ప్రసాద వితరణకు శ్రీవారి సేవకులు తరలివచ్చి భక్తులకు అందించారు. రాత్రి శ్రీరామచంద్రమూర్తి శేష వాహనంపై పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో కేరళ వాయిద్యాలు, స్థానిక సాంప్రదాయ మేళతాళాలు కోలాటం ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం రాత్రి స్వామిని దర్శించుకున్నారు. ఇలా కలెక్టర్కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు ఎ. ప్రశాంతి, ఎ. శివప్రసాద్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.













# జగమంత ...... శ్రీ రామ మయం





పులివెందుల ,మార్చి 27 , ప్రభాతవార్త :

పట్టణంలోని వాడ వాడలా, ప్రతి గ్రామంలో ప్రజలు శ్రీరామనామ నవమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీరామనామ జపములతో రామ మందిరాలు.. ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామ రామ కోదండ రామ జగమంతా నీవే రామ అంటూ శ్రీరామ సంకీర్తనలు నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా వాడ వాడలా సీతారాముల చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేసి పానకం. వడపప్పు పంపిణీ చేశారు. శ్రీరామ.. జయ రామ.. జయ జయ రామ అంటూ తమ భక్తిని చాటుకున్నారు. పట్టణంలోని భద్రాది రామాలయం (గీతామందిరం)లో సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. రీడింగ్రూమ్ వీధిలో ఉన్న రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాన్ని పంచిపెట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం, తూర్పు, పడమటి ఆంజనేయస్వామి. కోతి సమాధి, షిర్డిసాయిబాబా ఆలయాలతోపాటు తదితర ఆలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### కమనీయంగా సీతారాముల కల్యాణం :

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్థానిక నగరిగుట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. అర్చకులు రుద్రమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా బాజా భజంత్రీల మధ్య భక్తుల నడుమ శ్రీసీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అలాగే పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. పురోహితులు సీతారాముల కల్యాణం విశిష్టతను వివరిస్తూ కల్యాణం తిలకించిన వారికి బోగ భాగ్యాలు కలిగి సుఖసంతోషాలతో ఉంటారని వివరించారు.

# మొక్కజొన్న పంటకు మద్దతు ధర ఏది?

దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త:

మండల పరిధిలో వివిధ గ్రామాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. అయితే దీనికి మద్దతు ధర లేకపోవడంతో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని రామ్ సాయి నగర్, దువ్వూరు, మూడిళ్లపల్లె, నీలాపురం, మదిరేపల్లె, గుడిపాడు తదితర గ్రామాల్లో సుమారు 1600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఈ పంటను రైతులు రెండు రకాలుగా సాగు చేశారు. కొంతమంది రైతులు వాణిజ్య పరంగానూ మరికొందరు విత్తనోత్పత్తికి గాను మొక్కజొన్నను సాగు చేశారు. విత్తనోత్పత్తికి సాగుచేసిన మొక్కజొన్న ధరలు కంపెనీలే చూసుకుంటాయి. అయితే వాణిజ్య పరంగా సాగుచేసిన మొక్కజొన్న విత్తనాలకు సరైన ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న విత్తనాలకు క్వింటాలకు 2400 రూపాయలుగా నిర్ణయించింది. ఆ మద్దతు ధరతో వ్యాపారస్తులు గాని ఇతర సంస్థలు గాని కొనుగోలు చేయవలసి ఉంది. అయితే అలా ఎక్కడా జరగడం లేదు. దువ్వూరు మండలంలో సాగుచేసిన మొక్కజొన్న విత్తనాలు ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం వ్యాపారస్తులు కేవలం 1400 రూపాయల నుండి 1600వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కనీసం 800 రూపాయలు తేడా ఉండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు బాసటగా ఉంటుంది. ఇటీవల శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని అదేవిధంగా మొక్కజొన్న పంటకు కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రైవేట్ వ్యాపారస్తుల దోపిడీని అరికట్టి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



## పులివెందులలో ఘనంగా

# బాలరాముడి శోభాయాత్ర నిర్వహణ

పులివెందుల , మార్చి 27, ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలో శుక్రవారం సాయంత్రం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు బాలరాముడి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పడమటి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్ర ప్రారంభం కాగానే "జై శ్రీరామ్" నినాదాలతో పట్టణం మారుమోగింది. పూల అంగళ్లు, శ్రీనివాస హాలు, బంగారు అంగళ్లు, పాత బస్టాండ్ మార్గాల మీదుగా శోభాయాత్ర కొనసాగి శ్రీరామహాలు వరకు చేరుకుంది. అనంతరం రాముల స్వామి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లింది. భక్తులు భక్తి నినాదాలు చేస్తూ, హారతులు ఇస్తూ శోభాయాత్రను ఉత్సాహంగా కొనసాగించారు. స్థానికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



బాల రాముడి శోభ యాత్ర జరుగుతున్న దృశ్యం

## శేష వాహనంపై 'కోదండరాముడి'

# శేషశయన వైభవం

రాజంపేట, మార్చి 27 ప్రభాతవార్త:



ఏకశిలానగర పురవీధులు ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయాయి. శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు అత్యంత వైభవంగా శేష వాహనంపై దర్శనమిచ్చారు. విద్యుత్ దీపాల వెలుగులు, భక్తుల జయజయధ్వానాల మధ్య రామయ్య తండ్రి ఊరేగింపు భక్తజనానికి నేత్రపర్వంగా సాగింది.

### విద్యుత్ కాంతుల మధ్య దివ్య దర్శనం

చంద్రుని వెన్నెలతో పోటీపడుతూ ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సర్వాలంకార భూషితుడైన కోదండరాముడు, ఆదిశేషుడిపై కొలువై భక్తులను అనుగ్రహిస్తుంటే, ఆ దృశ్యం సాక్షాత్తు వైకుంఠాన్ని తలపించింది. స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

### కోలాటాల సందడి.. భక్తి పారవశ్యం..

ఊరేగింపు పొడవునా వందలాది మంది భక్తులు వేసిన కోలాటాలు, భజన బృందాల కీర్తనలు ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపాయి. కోలాట చిరుతల చప్పుడు, మంగళ వాయిద్యాల హోరు నడుమ రామయ్య పురవీధుల్లో విహరించారు. భక్తులు తమ ఇళ్ల ముందు స్వామి వారికి కర్పూర నీరాజనాలు అర్పించి, భక్తి పారవశ్యంలో మునిగితేలారు.



### శేష వాహన విశిష్ట

వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ వాహన సేవలో, లక్ష్మణుడి అంశ అయిన ఆదిశేషుడు స్వామివారికి ఛత్రంగా నిలవగా, రామయ్య రాజసంగా భక్తులకు అభయమిచ్చారు. శేష వాహనంపై ఉన్న స్వామిని దర్శించుకోవడం వల్ల సకల పాపాలు తొలగిపోయి, మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ దివ్య వేడుకతో ఒంటిమిట్ట ప్రాంతమంతా 'రామ నామ' స్మరణతో మారుమోగిపోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు, పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఒంటిమిట్టలో ఆకట్టుకున్న సంక్షిప్త రామాయఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాల్లో సంక్షిప్త రామాయణ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. రామాయణంలో ముఖ్యమైన ఘట్టాలను బొమ్మల రూపంలో కళ్లకు కట్టినట్లు భక్తులకు అర్థమయ్యేలా వివరిస్తూ ప్రదర్శించారు. స్వయంవరంలో శివ ధనుర్బాణం విరుచుట, కళ్యాణం, వనవాసంలో మాయ బంగారు జింక, సీతమ్మ అపహరణ, చెట్టుచాటున వాలి సంహరణ, లంకిని నోట వచ్చే హనుమాన్, సీతమ్మను చేరిన అంజన్న ఇలా ఎన్నో అద్భుత సన్నివేశాలను తీర్చిదిద్దారు.

# రెండు ఇళ్లలో భారీ అగ్నిప్రమాదం

- సుమారు రూ.6లక్షలు నష్టం

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు టౌన్ గీతాశ్రమం రోడ్డులో ఉన్న కృష్ణపాటి రాధమ్మ అలియాస్ స్టోర్ రాధమ్మ (40) ఇంట్లో కూలర్ నుంచి విద్యుత్తు సరఫరా అయ్యి ప్రమాదం జరగడంతో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు రాధమ్మ, ఆమె భర్త నాగరాజుల వివరాల మేరకు ఇంట్లోని సామగ్రి మొత్తం కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు అధికమై పక్కింటి రమాదేవి, బ్రహ్మయ్యల ఇళ్లు కూడా దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు, రూ.25వేలు నగదు, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక అధికారులు మంటలు అదుపు చేయడం జరిగింది. రెండు ఇళ్లలో కలిపి సుమారు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. కట్టుబట్టలతో బయటపడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## విద్యుత్కు అంతరాయం.

తొండూరు మార్చి 27 ప్రభాతవార్త:
మండలంలోని కృష్ణంగారిపల్లెలో 28న శనివారం ఉదయం 09.00 గంటల నుండి మధ్యాహ్నం 13:00 గంటల వరకు 33/11కెవి మదూరు సబ్ స్టేషన్, 11కెవి క్రిష్ణంగారిపల్లి ఫీడర్ పరిధిలో లైన్ షిఫ్టింగ్ కారణంగా వ్యవసాయ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. దయచేసి ప్రజలు మరియు రైతులందరూ సహకరించవలసినదిగా కోరుతున్నాను. విద్యుత్ ఏఈ వి.బాలసంజీవులు ఒక ప్రకటన ద్వారా ప్రజలందరికీ తెలియజేయడం జరిగింది.

## వేసవిలో దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం



ముద్దనూరు,మార్చి 27, ప్రభాతవార్త:
స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కడపజిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎండాకాలం సంభవించడంతో వేడిని అధిగమించడానికి పోలీస్ స్టేషన్ కు వచ్చు బాధితులకు, బాటసారుల సౌకర్యార్థం దాహం తీర్చడం కొరకు చల్లటి త్రాగునీరు అందించాలనే సదుద్దేశంతో పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రాన్ని శుక్రవారం సీఐ నగేష్ బాబు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేసవిలో దాహం తీర్చడానికి చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ప్రజలు హర్షించారు. పట్టణ ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ.మధుసూదన్ రెడ్డి ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్రీమాన్ డ్రై సోయింగ్ పంట కోత ప్రయోగం



మైదుకూరు, మార్చి 27, ప్రభాతవార్త:
మైదుకూరు మండలం ఆదిరెడ్డిపల్లె యూనిట్ పరిధిలోగల ముసల నాయని పల్లి గ్రామంలో రైతు వెంకటేష్ యొక్క పొలంలో పిఎండిఎస్ ( ఫ్రీమాన్ డ్రై సోయింగ్) పద్ధతిలో వేసిన పంటను యూనిట్ ఇంచార్జ్ రామనందరెడ్డి ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం చేయడం జరిగింది. ఈ ప్రయోగంలో 25 అడుగుల విస్తీర్ణంలో 85 కేజీల 55 గ్రాములు దిగుబడి రావడం జరిగింది. ప్రతి రైతు ప్రధాన పంట వేసే ముందుగా ఒక ఎకరానికి 25కేజీ విత్తనాలు తక్కువ కాకుండా వేయాలి వీటిలో ప్రధానంగా పచ్చి రొట్టె, నూనె జాతి, గింజ జాతి, జీవవైవిద్యం గల విత్తనాలను పొలంలో చల్లుకొని 45 రోజుల అనంతరం పశువుల మేతగా లేక ప్రధాన పొలంలో కలియ దున్నుకోవచ్చు దీనివలన ప్రధాన పంటకు సుమారు ఒక ఎకరానికి 14 నుండి 15 టన్నుల బయోమాస్ లభించును దీనివల్ల ప్రధాన పొలం లోని సూక్ష్మజీవుల వృద్ధి ప్రధాన పొలానికి కావలసిన కర్బనం లభించును, పంట అధికశాంద్రతో ఉండడం వల్ల కలుపు నివారణ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేవ నాయక్, వీరయ్య రైతులు పాల్గొన్నారు.

## దాహం తీర్చిన మండల అధ్యక్షురాలు..

సుండుపల్లె, మార్చి 27,ప్రభాతవార్త :
మండల పరిధిలోని పెద్దినేనికాల్వ గ్రామం తో టిమాలపల్లి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండి బోర్లలో నీరు అడగంటి పోయి త్రాగు నీరు పల్లెకు సరిపడా రానందున మండల అధ్యక్షురాలు మూడే రాజమ్మను అడిగిన వెంటనే ఏంపిపి స్పంధించి మండల గ్రాంటు నిధులతో బోర్ మంజూరు చేసి డ్రిల్లింగ్ వేయించడం జరిగింది. పుష్కలంగా నీళ్ల పడడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటు SC, ST ల పక్షపాతి మూడే రాజమ్మ కీ మరియు షేక్ ఖాదర్ వలీ సహకారాలను మరిచిపోలేము అంటూ గ్రామ ప్రజలు తోపాటు పాలరెడ్డయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు



## వైభవంగా సీతారాముల కళ్యాణం

### స్వామివారి కల్యాణ వస్త్రాలు సమర్పించిన వివేకానంద రెడ్డి



బద్వేల్ అర్బన్ మార్చి 27 ప్రభాతవార్త :
వల్లెరవారిపల్లెలో శ్రీరామనవమి వేడుకలు గ్రామ పెద్దలు మరియు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి కళ్యాణం, అన్నప్రసాద కార్యక్రమాన్ని కాంట్రాక్టర్ నాగలకుంట్ల వివేకానంద రెడ్డి కుటుంబ సభ్యులు సహకారంతో నిర్వహించడం జరిగింది. శ్రీరామ నవమి సందర్భంగా తెల్లవారుజామునండి గ్రామంలోని ప్రజలందరూ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన కల్యాణ మహోత్సవాన్ని భక్తాదులందరూ తిలకించి, తమ కోరికలను తీర్చుకున్నారు, అలాగే శ్రీరామనవమి వేడుకలకు సహకరించిన పలువురు ఉభయ దాతలకు గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కోదండరామాలయంలో సీతారాముల కళ్యాణం

సిద్దవటం మార్చి 27 ప్రభాతవార్త
మండలకేంద్రమైన సిద్దవటం దిగువపేటలో కడప బద్వేలు ప్రధాన రహదారిలో వెలసిన కోదండరామాస్వామి ఆలయంలో శ్రీరామనవమి ని పురస్కరించుకొని శుక్రవారం సీతా, రాముల కళ్యాణాన్ని వేద పండితులు వేద మంత్రాలతో నడుమ కళ్యాణాన్ని నిర్వహించారు కళ్యాణానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కోదండరామ స్వామి ఆలయంలో జరుగుతున్న సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు గోపిశెట్టి నాగరాజు మాజీ రిటైర్డ్ ఏఈ బసెట్టి సుబ్రమణ్యం అక్కిశెట్టి రత్నం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు

### బద్వేల్ ప్రాంత ప్రజలకు వడపప్పు పానకం పంపిణీ చేసిన వాసవి వనిత క్లబ్



బద్వేల్ అర్బన్ మార్చి 27 ప్రభాతవార్త :
శ్రీరామనవమి పురస్కరించుకొని శుక్రవారం మైదుకూరు రోడ్డు అన్న క్యాంటీన్ మంచినీటి చలివేంద్రం వద్ద వాసవి క్లబ్ అధ్యక్షులు భూపాలం రాఘువేంద్రరావు, సెక్రటరీ బచ్చు సందీప్, ట్రెజరర్ బైసాని సుమంత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, సెక్రటరీ బొగ్గరపు వెంకటసుబ్బమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మల ఆధ్వర్యంలో పలువురు పాదాచారులకు వడపప్పు, పానకం వితరణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షులు, వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ అడ్మిన్ కే.వీ సుబ్బారావు, మాజీ వాసవి క్లబ్ అధ్యక్షుడు, మేధాహళ్లు భార్గవ్, వనితా క్లబ్ జోన్ చైర్మన్ చింతకుంట ధన లక్ష్మి, చేతుల మీదుగా పలువురికి వితరణ చేయడం జరిగింది, ఈ సందర్భంగా వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రెటరీ అడ్మిన్ కుప్పం వెంకటసుబ్బారావు మాట్లాడుతూ విష్ణు ఏడవ అవతారమైన శ్రీరాములు జన్మించిన రోజు సీతారాముల కళ్యాణం ఉత్సవాలు రాముని పట్టాభిషేకం జరిగేటటువంటి శ్రీరామనామి రోజు పలువురు పట్టణంలోని భక్తాదు లందరికీ స్వామి వారికి ప్రీతికరమైన వడపప్పు, పానకం ప్రసాదాన్ని పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమన్నారు, శ్రీరామనవమి వేడుకలను వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు,రాష్ట్ర ప్రజలందరికీ సీతారాముల స్వామివారి కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో తులసి వెంకటసుబ్బయ్య, పెసల సుధాకర్, తులసి వెంకటసుబ్బయ్య, చుండూరు వెంకటసుబ్బయ్య, చింతకుంట రవికుమార్, వెంకటరమణ మరియు పలువురు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం వేడుకలో పాల్గొన్న చమర్తి



సిద్ధవటం, మార్చి 27 ప్రభాతవార్త
శ్రీరామనవమి పండుగ సందర్భంగా సీతారాముల ఉత్సవమూర్తుల మూల విరాట్ విగ్రహాలకు వైభవ హితంగా కళ్యాణం నిర్వహించారు సిద్ధవటం మండలంలోని కడపాయపల్లె, లింగంపల్లి గ్రామాలకు చెందిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా శుక్రవారం సీతారాముల ఉత్సవమూర్తుల విగ్రహాలకు కళ్యాణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు. ఆయనకు ఆలయం మర్యాదలతో ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లింగంపల్లి, కడ పాయపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు ఐకమత్యంతో శ్రీరామనవమి పండుగ పర్వదినాన లోక కళ్యాణం నిర్వహించడం సంతోషకరమని ప్రతి ఒక్కరికి సీతారాముల అనుగ్రహం కలగాలని రైతుల పంటలు దిగుబడి చెంది రైతు కుటుంబాలలో ఆనందం కలగాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్ పార్లమెంటు ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి శివరాం రెడ్డి సర్పంచ్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు తుర్ర ప్రతాప్ నాయుడు మాజీ అధ్యక్షుడు మామిడి సుబ్బారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సూర్యనారాయణ మృతి

మైదుకూరు, మార్చి 27, ప్రభాతవార్త:
మైదుకూరు పట్టణ ప్రొద్దుటూరు రోడ్డు భూమిరెడ్డి నారాయణ ప్రథమ పుత్రుడు సూర్యనారాయణ వారి కుమారుడు కడప పట్టణ రాయచోటి రోడ్డు బైపాస్ రహదారిలో చైతన్య స్కూలు నందు వారి కుమారుడు వెంకట్ నారాయణ ను తోడుకొని టు వీలర్ పై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తండ్రి కుమారుడికి తీవ్ర గాయాలు కావడం తో బేస్తవారం ఆసుపత్రికి తరలించారు. వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తండ్రి సూర్యనారాయణ చికిత్స పొందుతూ మృతిచెందారు. వారి కుమారుడు వెంకట్ నారాయణ ఆసుపత్రిలో స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నాడు, మృతి చెందిన సూర్య నారాయణకు ఇద్దరు కుమారులు, వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు, ఇంటికి పెద్ద దిక్కు మరణించడంతో శోకసముద్రంలో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. 40సం వయసులోనే మృతి చెందడంతో అందరికంట కన్నీరు ఆగలేదు, సూర్యనారాయణ వ్యక్తికి క్రికెట్ అంటే అభిమానం.మైదుకూరు నియోజకవర్గంలో క్రికెట్ అభిమానులు నారాయణ తెలియని వారు లేరు గతంలో మైదుకూరు ఎం.సి.సి క్రికెట్ జట్టుకు కెప్టెన్ వ్యవహరిస్తూ అద్భుత విజయాలను జట్టుకు అందించాడు అనంతరం క్రికెట్ ఆటకు రిటైర్మెంట్ ఇచ్చినా నియోజకవర్గం లో యువతను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్లు నిర్వహిస్తూ అందరినీ ప్రోత్సహించేవాడు ఆ నారాయణ ఇక లేరు అని తెలియడంతో క్రీడాభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో క్రీడా అభిమానులు, యువకులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన ఆర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు అర్బన్ , మార్చి 27, ప్రభాతవార్త :
మత్స్య పారిశ్రామిక కాలనీ నూతన ఆర్చ్ ఏర్పాటు చేయడం ఆనందకరమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మత్స్య కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చ్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో దాదాపు 40 సంవత్సరాల క్రితం మత్స్య కాలనీ ఆర్చ్ ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఆ ఆర్చ్‌ను ఆధునీకరించాల్సి వచ్చిందని ఈ తరుణంలో తాము గతంలో ఈ వార్డులో గెలిస్తే ఆధునికరిస్తామని హామీ ఇచ్చామని ప్రస్తుతం ఈ హామీ నెరవేర్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ ముక్తియార్, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవ రెడ్డి, టిడిపి నాయకులు ఈ.వి. సుధాకర్ రెడ్డి, నాగరాజు, టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శివాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం

ప్రొద్దుటూరు అర్బన్ , మార్చి 27, ప్రభాత వార్త
ప్రొద్దుటూరు పట్టణంలో నడిబొడ్డున ఉన్న శివాలయంలో ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి దంపతులు చేతుల మీదుగా శుక్రవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాడవాడలా సీతారాముల ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉభయదారులు కల్యాణం నిర్వహించారు. కాగా మండి మార్కెట్, వసంతపేట, అగస్తేశ్వరాలయం తదితర ప్రాంతాల్లో జరిగిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొన్నారు.



# శ్రీరామనవమి సందర్భంగా ఘనంగా సీతారాముల కళ్యాణం





బద్వేల్, మార్చి 27, ప్రభాతవార్త
బద్వేల్ మండలంలోని నందిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని బద్వేల్ మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మన్యం సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మన్యం రామిరెడ్డి, పంగా శేషారెడ్డి, లోమటి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీరామనవమి





రాజుపాళెం, మార్చి 27, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గ్రామ గ్రామాన శుక్రవారం శ్రీరామనవమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు గ్రామాలలో సీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా, కన్నుల పండుగ నిర్వహించి భక్తి కీర్తనలు, భజనలతో, మహిళల కోలాటంతో సీతారాముల గ్రామోత్సవం నిర్వహించడం జరిగినది. కొర్రపాడు, కొట్టాల, గాదెగూడూరు, టంగుటూరు తదితర గ్రామాలలో రామాలయాలలో సీతారాముల కళ్యాణంను వేద పండితులు మంత్రోచ్ఛరణలతో, ప్రతి కళ్యాణ ఘట్టము విశిష్టతను ప్రజలకు వివరిస్తూ కన్నుల పండుగ జరుపుకోవడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవమునకు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణమును తిలకించారు. పలువు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## ఫ్యాక్షన్ జోలికెళ్తే చర్యలు తప్పవు

### - ఎస్సై తులసీ నాగప్రసాద్



పెండ్లిమర్రి, మార్చి 27, ప్రభాతవార్త:
మండలంలోని గ్రామాల్లో ఫ్యాక్షన్‌కు పాల్పడితే చర్యలు తప్పవని పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పెండ్లిమర్రి పోలీసు స్టేషన్ లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. తమ భార్యపిల్లలను దృష్టిలో ఉంచుకొని జీవించాలని జైలుకెళ్లి వారి జీవితాలు అంధకారం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శ్రీను, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాములు వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

రామసముద్రం మార్చి 27 ప్రభాతవార్త
మండలంలోని కమ్మువారిపల్లె గ్రామ పంచాయతీ లోని ఎర్ర బోయిన పల్లె గ్రామంలో కొలువైన శ్రీ కోదండ రాముల వారిని ఎమ్మెల్యే షాజాహాన్ బాషా దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే షాజాహాన్ బాషాను వేదమంత్రాలతో ఆశీర్వాదములతో దీవించి తీర్థ ప్రసాధాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పాడి పంటలు బాగా పండి రైతులు, గ్రామ ప్రజలు సుఖ శాంతులతో కలిగి ఉండాలని మనస్ఫూర్తిగా దేవుడు ని కోరుకుంటున్నాన న్నారు. ఈ శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే షాజాహన్ బాషా, ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:
బీసి ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన ఏఎస్పి యు. విభూ కృష్ణ చేతుల మీదుగా చలివేంద్రం కార్యక్రమం ఏర్పాటు ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా బీసి సమాఖ్య అధ్యక్షులు బొర్ర రామాంజినేయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరము తాము ఈ ప్రజల దాహార్తి కొంచమైనా తగ్గించే దిశగా ఈ ప్రధాన రహదారిలో వైవిఎస్ మున్సిపల్ హై స్కూల్ వద్ద ఈ వేసవి కాలంలో వెయ్యి మందికి మంచినీరు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏఎస్పీ మాట్లాడుతూ బీసీ ప్రజా చైతన్య సమాఖ్య చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలు చాలా బాగున్నాయని ఇలాగే కొనసాగాలని ఈ సమాఖ్యకు తన సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా వడపప్పు, మజ్జి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దేవేంద్రుడు, ఆర్థిక కార్యదర్శి మడకా సంటయ్య, ఉపాధ్యక్షులు కొత్తపల్లి శీను, వేల్పుల భాస్కర్, జీసీ పుల్లయ్య, భాస్కరరావు, ప్రతాప్ నాయుడు, అంకాల్, కొండయ్య, మల్లికార్జున, మైలగాని శీను, పోసా ఆదినారాయణ, కొమ్మది రాముడు, సంగటి రవీంద్ర, పరమేశ్వరరావు, ఇంకా అనేక మంది సభ్యులు పాల్గొన్నారు.



# రాజీనామా అనంతరం వెంటనే అదే యజమాని క్రింద ఉద్యోగంలో చేరితే సర్వీస్ ప్రొటెక్షన్ ఉంటుంది

(ఒరిస్సా హైకోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, మార్చి 27 ప్రభాతవార్త:
ఓ ఉద్యోగి టెక్నికల్‌గా రాజీనామా సమర్పించి అంతరాయం లేకుండా ఆ వెంటనే అదే యజమాని క్రింద అదే ఉద్యోగంలో తిరిగి చేరితే పెన్షన్ ప్రయోజనాల కొరకు సర్వీసు కొనసాగింపు సంరక్షింపబడుతుందని జస్టిస్ దీక్షిత్ కృష్ణశ్రీ ప్రసాద్, జస్టిస్ సిబోశంకర్ మిశ్రాతో కూడిన ఒరిస్సా హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును వెలువరించింది. వివరాలలోకి వెళితే... నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్‌లోని ఈడివిసి ప్రాజెక్టులో తాత్కాలిక ప్రాతిపదికన ఓ ఉద్యోగిని టెక్నికల్ ఆఫీసరుగా నియమించగా అదే ప్రాజెక్టులో అతడు రీసెర్చ్ సైంటిస్టుగాను, తరువాత సీనియర్ రీసెర్చ్ సైంటిస్టుగాను పదోన్నతి పొందాడు. అతనికి ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే రెగ్యులర్ పే స్కేల్ కూడా ఇచ్చారు. నిర్ణీత ఎంపిక ప్రక్రియ తరువాత 2007 లో అదే రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ రీసెర్చ్ ఆఫీసరుగా రెగ్యులర్ కేడర్ ఉద్యోగిని నియమించారు. తే.15.3.2007 దీన అతను తన తాత్కాలిక పదవి నుండి టెక్నికల్‌గా రాజీనామా లేఖను సమర్పించాడు. మరుసటి రోజు తను కొత్త రెగ్యులరైజ్డ్ పోస్టులో విధులకు హాజరయ్యాడు. అదే కార్యాలయంలో అదే డైరెక్టరు క్రింద ఉద్యోగ సేవ కొనసాగించాడు. పదవీ విరమణ తరువాత పెన్షన్, టెర్మినల్ బెనిఫిట్స్ కొరకు 1988 నుండి 2007 వరకు అతడి సుమారు 19 సంవత్సరములు తాత్కాలిక సేవను లెక్కించడానికి అధికారులు నిరాకరిస్తూ రాజీనామా కారణంగా వచ్చిన విరామాన్ని అధికారులు "సేవను నిలిపివేయడంగా" పరిగణించడంతో ఆ ఉద్యోగి కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా అతని గత, తాత్కాలిక సేవను "పెన్షన్‌కు అర్హత కలిగిన సేవ"గా గుర్తించాలని ట్రిబ్యునల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ భారత ప్రభుత్వం ఒరిస్సా హైకోర్టులో రిట్ పిటీషన్‌ను దాఖలు చేయగా ఆ ఉద్యోగి రాజీనామా లేఖను తగిన స్థాయి అధికారి, అధికారికంగా ఎప్పుడూ అంగీకరించలేదు కాబట్టి అతని కేసు "సాంకేతిక రాజీనామా"గా పరిగణించబడదని భారత్ యూనియన్ వాదించింది. అధికారిక అంగీకారం రికార్డులో లేనపుడు ఐడివిసి ప్రాజెక్టు క్రింద అతని మునుపటి సేవను టెర్మినల్ ప్రయోజనాల కొరకు అతని తదుపరి రెగ్యులర్ నియామకంతో విలీనం చేయలేమని తెలిపింది. మరో వైపు తన రాజీనామా సాంకేతిక స్వభావాన్ని కలిగి వున్నదని ఉద్యోగి వాదిస్తూ తే.15.3.2007 దీన మధ్యాహ్నం తన రాజీనామాను సమర్పించాడు. అది ఆమోదించబడిన తరువాత మరుసటి రోజు ఉదయం రెగ్యులర్ పోస్టులో చేరి అదే కార్యాలయంలో అదే పదవిలో అదే టేబుల్, కుర్చీతో అదే పర్యవేక్షణలో తన పనిని కొనసాగించాడు. అందు వల్ల మునుపటి సేవకు, తదుపరి సాధారణ సేవకు చూపబడిన అంతరం కేవలం కల్పితమైంది మాత్రమే. ఉద్యోగి తే.15.3.2007 న తన సాంకేతిక రాజీనామాను సమర్పించాడని కోర్టు అంగీకరించింది. రాజీనామా లేఖ మరియు విధుల్లో చేరిన నివేదిక రెండూ ఒకే అధికారికి ఉద్దేశించబడ్డాయి. ఆ రెండు లేఖల మధ్య అంతరం 24 గంటల కంటే తక్కువగా ఉంది. అందు వల్ల ఉద్యోగి విధుల్లో చేరిన నివేదికను ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అంగీకరించినపుడు సాంకేతిక రాజీనామా కూడా అంగీకరించబడినట్లుగా భావింపబడింది. రాజీనామాను అధికారికంగా తెలియజేయకపోయినప్పటికీ అది అంగీకరించబడిన తరువాత అమలులోకి వస్తుందని తీర్పు ఇవ్వబడింది. రాజీనామా ఆమోదం ఎల్లపుడు అధికారిక, వ్రాతపూర్వక ఉత్తర్వు ద్వారానే ఉండవలసిన అవసరం లేదు, అది సమర్థ అధికారి ప్రవర్తన నుండి కూడా ఊహించవచ్చు, మౌనం అంగీకారానికి సమానం. ఉద్యోగి ఎంపిక కావడానికి ముందు సాధారణ ప్రాతిపదికన నియమితులైన తరువాత కూడా అదే కార్యాలయంలో పని చేశారని రుజువైంది. అందువల్ల అధికారిక ఆమోదం లేనప్పటికీ రాజీనామా అమలులోకి వస్తుంది. "కృష్ణకాంత్ తివారీ ఎదిరి కేంద్రీయ విద్యాలయ సంఘటన్" మరియు "శ్రీ జితేంద్ర కుమార్ ఎదిరి ఇంద్రప్రస్థ పవర్ జనరేషన్ కో. లిమిటెడ్" కేసులలోని తీర్పులపై ఆధారపడి సాధారణ రాజీనామాకు సాంకేతిక రాజీనామాకు మధ్య తేడా ఉందని కోర్టు తెలిపింది. సంపూర్ణ రాజీనామా విషయంలో ఉద్యోగి, యజమాని సంబంధం అన్ని ప్రయోజనాల కోసం ముగిసిపోతుంది, కాబట్టి సేవలో విరామం ఉంటుంది, సాంకేతిక రాజీనామా విషయంలో అదే పదవిలో సేవ కొనసాగింపు కేవలం భావనలోనే ఉంటుంది. సరైన పద్ధతిలో మరొక ప్రభుత్వోద్యోగంలో చేరడానికి సమర్పించిన రాజీనామా సాంకేతిక రాజీనామా క్రిందకు వస్తుందని ఉద్యోగికి సర్వీసు కొనసాగింపునకు అర్హత ఉంటుందని డివిజన్ బెంచ్ తీర్పునిచ్చింది. ఇంకా సిసిఎస్ (పెన్షన్) నియమాలు-1972 లోని రూల్ నెం.13 మేరకు ఎటువంటి అంతరాయం లేకుండా శాశ్వత నియామకం ద్వారా కొనసాగే తాత్కాలిక సేవను అర్హమైన సేవగా పరిగణించడానికి అనుమతినిస్తుంది. ఇది రూల్ నెం.26(2) ద్వారా మరింత బలపరుచబడింది. ఇది ప్రభుత్వములో మరొక నియామకాన్ని చేపట్టడానికి రాజీనామా సమర్పించినపుడు గత సేవను కోల్పోకుండా నిరోధిస్తుంది. పదవీ విరమణ ప్రయోజనం కొరకు ఉద్యోగి మునుపటి తాత్కాలిక సేవను సాధారణ సేవతో పాటుగా కలిపి గుర్తించాలని తీర్పునిచ్చింది. చివరగా ఉద్యోగి సుమారు 19 సంవత్సరములు నిరంతర విశిష్ట సేవను అందించారని, అందులో కష్టమైన క్షేత్ర స్థాయి పోస్టింగులు కూడా ఉన్నాయని డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. అలాగే అతని నియామకం అక్రమ పద్ధతిలో జరిగింది కాదని, అందువల్ల పెన్షన్ కొరకు గత సర్వీసు ప్రయోజనాన్ని అతనికి నిరాకరించడం సంక్షేమరాజ్య సూత్రాలకు విరుద్ధం అవుతుందని ట్రిబ్యునల్ నిర్ణయంలో ఎలాంటి లోపం కన్పించలేదని సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వును డివిజన్ బెంచ్ సమర్థిస్తూ భారత ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటీషన్‌ను డివిజన్ బెంచ్ కొట్టివేస్తూ ఈ తీర్పును వెలువరించింది. (సైటేషన్: యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్ ఎదిరి డాక్టర్ మనోజ్ కుమార్ దాస్, కేసు నెం.డబ్ల్యుపి (సివిల్) నెం.27890/2025)

# నీటి కోసం నిన్న హామీ...24 గంటల్లోనే అమలు

**రాజంపేట మార్చి 27 ప్రభాతవార్త:**
ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారంలో తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి చెమటి జగన్ మోహన్ రాజు దూకుడు ప్రదర్శిస్తున్నారు. నీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం చెప్పారు. చమర్తి శాశ్వత పరిష్కారం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజంపేట పట్టణం ఈడిగపాళెం పర్యటిస్తున్న నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజుకు గురువారం వార్డు ప్రజలు నీటి సమస్యలపై ఫిర్యాదు చేశారు.తక్షణమే స్పందించిన చమర్తి 24 గంటలు తిరగకముందే ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో శుక్రవారంబోరు వేయించి తాను మాటల మనిషి కాదని చేతల మనిషని జగన్ మోహన్ రాజుగారు నిరూపించుకున్నారు.ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లగా తాము నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని,వార్డు పర్యటనలో చమర్తి దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. బోర్ కూడా వేయడం పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్,మున్సిపల్ కౌన్సిలర్ మీసాల వెంకటసుబ్బయ్య, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మంద శ్రీనివాసులు,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,మాజీ కౌన్సిలర్లు మనుబోలు వెంకటేశ్వర్లు,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు,వార్డు అధ్యక్షులు భరత్,లస్సీ బాలాజీ, శంకరాచారి, 22 వార్డ్ అధ్యక్షులు సుబ్రమణ్యం, ఎన్టీఆర్ కేశవ, తదితరులు పాల్గొన్నారు.



ఈడిగ పాలెం లో కొత్త బోరుకు భూమి పూజ లో పాల్గొన్న జగన్మోహన్ రాజు

రామనామ స్మరణతో మార్మోగిన

## ఊరు... వాడ...ఎక్కడ చూసినా సీతారామ కళ్యాణాలే..



**రాజంపేట,మార్చి 27 ప్రభాతవార్త:**
శ్రీరామనవమి అంటేనే ఊరువాడా పులకించిపోతుంది. పల్లె కాదు, పట్టణం కాదు.. ఎక్కడ చూసినా శ్రీ రామనామస్మరణ . జైశ్రీరామ్ అంటూ భక్తిశ్రద్ధలతో యువత కేరింతలు కొడతారు.భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఆ పండుగ రానే వచ్చింది. శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు ఊరు వాడ మార్మోగాయి. రాజంపేట పట్టణంలో సాయి నగర్ , బంద్రాళ్ల వీధి, ఈడిగపాలెం, నూనె వారి పల్లె రోడ్డు,కొలిమి వీధిలో అభిషేకాలు, కుచివారిపల్లెలో శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్ని అంటాయి.తాళ్లపాకలో కళ్యాణం, భరత్ నగర్ లో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేడుకలతో ఊరువాడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం, రాత్రి వేలాదిమంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయి నగర్ లో జరిగిన సీతారాముల కళ్యాణం కి భక్తులు పోటెత్తారు.



# నేత్ర పర్వంగా సీతాముల కళ్యాణోత్సవం





**బద్వేలు అర్బన్, మార్చి 27, ప్రభాతవార్త :**
బద్వేలు పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఆలయ కమిటి అధ్యక్షులు పేర్ల జనార్ధనరావు , సెక్రటరీ బచ్చు నాగేశ్వరరావు, కోశాధికారి కొండపల్లి సాయికుమార్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీ వల్లంకొండు సత్యనారాయణ, వి.శ్రీరాములు, ఉపాధ్యక్షులు తులసి సుబ్రమణ్యంతోపాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు తంగి శ్రీరామశర్మ ,కృష్ణపాటి లక్ష్మీనారాయణ శాస్త్రి, పవన్‌కుమార్, సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే వివిధ ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా ప్రత్యేక బ్యాండు మేళ తాళాల మధ్య పలువురు భక్తులను ఆకట్టుకునేలా నిర్వహించారు. కళ్యాణం ఉభయదాతలుగా ఎస్ఆర్ఎన్‌బీ రెసిడెన్సి యజమాని డాక్టర్ సాయి దిలీప్ గుప్తా, సతీమణి హైమావతి, యల్లనూరు వెంకటరమణ, సతీమణీ హేమ మాలిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆవోపా కమిటి సభ్యులు మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం శ్రీరామనవమి వేడుకలలో పాల్గొన్న పలువురు ఉభయదాతలకు ఆలయ కమిటి సభ్యులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి. సుబ్బారావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కొలిశెట్టి నాగరాజ, మాజీ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఉరిమి శ్రీనివాసులు, వల్లంకొండు సత్యనారాయణ, పబ్బతి సత్యం, పత్తి క్రిష్ణమూర్తి, మరియు పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## సదరం మాయాజాలం..
# స్లాట్స్ బుకింగ్ కోసం దివ్యాంగుల తిప్పలు

**ప్రొద్దుటూరు క్రైం, మార్చి 27, ప్రభాతవార్త:**



సదరం ఒక మాయాజాలంగా ముగిసిందని రోజంతా పనిచేయని సర్వర్లు, సదరం స్లాట్లు ఫుల్. మరి ఎవరికిచ్చారో ఎలా చేశారో తెలియని దుస్థితి దాపురించిందని ఆల్ ఆఫ్ యు దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ దొడియం అప్జల్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ పార్కు వద్ద దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరం సర్వర్ సమస్య తమ ఓపికకు పరీక్షగా మారిందని దివ్యాంగులు, సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. సదరం సర్టిఫికెట్ల బుకింగ్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించే వారు లేరని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క రోజులో 57,452 స్లాట్ బుక్ చేసుకున్నారని ప్రకటన చూసి దివ్యాంగులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సదరం స్లాట్ కోసం ఆరు నెలల నుంచి ఎదురుచూస్తున్న వారికి ఈ సారి కూడా నిరాశ మిగిలిందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

# బద్వేలు పట్టణంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు





**బద్వేలు అర్బన్, మార్చి 27, ప్రభాతవార్త :**
శ్రీరామనవమిని పురస్కరించుకుని బద్వేలు పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో ని బీఎస్ఎన్ఎస్ కార్యాలయం శ్రీశ్రీ రామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలను శుక్రవారం ఆలయకమిటి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.అలాగే శ్రీకృష్ణ దేవరాయనగర్‌లో వైభవంగా స్వామివారి కళ్యాణ మహోత్సవం, తెలుగుంగ కాలనీ, రాజుగారివీధి, ఆంజనేయనగర్, అబ్బరాతి వీధి, కోటవీధి తదితర చోట్ల స్వామివారి కళ్యాణం నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

# దశావతారాలలో ఏడవ అవతారం రామావతారం



**వేంపల్లె మార్చి 27 (ప్రభాతవార్త)**
దశావతారాల్లో రామావతారం ఏడవ అవతారం అని, శ్రీరామచంద్రుడు ఒక పురుషోత్తముడని, ఆదర్శ పాలకుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించారు. తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ అందరికీ పానకం,వడపప్పు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ధర్మం నశించినప్పుడు, అధర్మం విజృంభించి నప్పుడు, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం శ్రీ మహావిష్ణువు భూమి మీద అవతరిస్తాడని,వాటినే దశావతారాలు అంటారని అన్నారు. శ్రీ మహా విష్ణువు దశావతారాల్లో ఏడవ అవతారం రామావతారం అన్నారు, త్రేతాయుగంలో రావణ కుంభకర్ణాది రాక్షసులను, దుర్మార్గులను సంహరించి సమాజాన్ని రక్షించేందుకు శ్రీ మహావిష్ణువు శ్రీరామునిగా అవతరించాడన్నారు.శ్రీరామునికి నవమికి ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. శ్రీరామచంద్రుడు నవమి రోజు భూమి మీద అవతరించారు. నవమి నాడు సీతమ్మ తల్లిని పరిణయం ఆడాడు. రావణ సంహార అనంతరము నవమినాడు అయోధ్యలో పట్టాభిషిక్తుడయ్యాడు. ఆ విధంగా నవమికి శ్రీరామచంద్రునికి విడదీయరాని బంధం ఉంది అన్నారు. శ్రీరామచంద్రుడు ఒక ఉత్తమమైన మానవుడు.పితృ వాక్య పరిపాలకుడు.ఏకపత్నీ వ్రతుడు. ఒకే భార్య, ఒకే బాణం,ఒకే మాట ఇవి రామునికి పర్యాయపదాలు. శ్రీరామచంద్రుడు ఆదర్శ పాలకుడు. రామరాజ్యంలో దొంగతనాలు, వ్యభిచారాలు,మోసం ఉండేవి కావ! ప్రజలు సుఖశాంతులతో, శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేవారట. అందువల్ల యుగాలు మారినా, రాజులు మారినా నేటికీ ప్రజలు రామరాజ్యం కావాలని కోరుకుంటారు. స్వాతంత్ర అనంతరం భారతదేశంలో రామరాజ్యం విలసిల్లాలని జాతిపిత పూజ్య బాపూజీ కలలు కన్నాడు.ఆయన కన్న కలలను నిజం చేసేటందుకు శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా ప్రతి ఒక్కరూ అంకితం, పునరంకితం కావాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి శ్రీమతి నర్రెడ్డి అలివేలమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ధ్రువ కుమార్ రెడ్డి, రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# పోషక విలువలకు కేరాఫ్ రేషన్ బియ్యం

## రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారంటే పోషక పదార్థాలు వదులుకున్నట్టే ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

**పీలేరు మార్చి 27 ప్రభాతవార్త:**
రేషన్ బియ్యం అమ్ముకుంటున్నారా.. అయితే పోషక విలువలు వదులుకున్నట్లే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ప్రజలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని చాలా మంది ప్రజలు తెలియక రూ.10, రూ.20 చొప్పున అమ్మకుంటున్నారు. చాలా మంది తెలియక ఈ రేషన్ బియ్యంలో శరీరానికి అవసరమైన పోషక విలువలను వదులుకుంటున్నారు. రేషన్ బియ్యం ప్రజలకు సరఫరా చేయడానికి ప్రభుత్వం రైతులు, రైస్ మిల్లులు నుంచి ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చి ప్రజలకు సరఫరా చేస్తోంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు పెడుతోంది. ఇదేమీ తెలియదన్నట్లుగా ప్రజలు వ్యవహరిస్తూ ఉచితంగా వచ్చిన బియ్యానికి వచ్చిన కాడికి రానీలే అని అమ్ముకుంటున్నారు.

### రేషన్ బియ్యంలో లభించే పోషక విలువలు

ఇతర రకాల బియ్యం లాగానే రేషన్ బియ్యంలో కూడా శరీరానికి శక్తినందించే కార్బోహైడ్రేట్లు లభిస్తాయి. పోషకాహార లోపాల్ని ఎదుర్కోవడానికి ఐరన్, ఫోలిక్ అన్నం విటమిన్ బి 12 వంటి సూక్ష్మ పోషకాలతో నిండి ఉంటాయి. పాలిష్ చేయని బియ్యం సాధార తెల్లబియ్యం కంటే ఎక్కువ ఫైటర్, ప్రోటీన్లు కలిగి ఉంటాయి. ఫోర్టిఫికేషన్, ఐరన్, ఫోలిక్ అన్నం లోపాలను పరిష్కరించడానికి సహాయపడుతుంది. పిల్లలు 67శాతం, మహిళలు 57 శాతం, గర్భిణీలు 2 శాతం రక్త హీనత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది.ఈ సమస్యను అధిగమించే స్వభావం ఈ రేషన్ బియ్యంలో కలవు. ఇవే కాకుండా ఇడ్లీ, రాగి సంగటి, దోశ, ఇడియప్పం, ఉప్మా, పొంగల్ ఈ బియ్యం ద్వారా చేసుకుని తింటే మంచి పోషక విలువలు శరీరానికి అందుతాయి. అన్నిటికంటే జీర్ణశక్తి పెరిగి మలబద్ధకం నుంచి ఉపశమనం పొందవచ్చు.

### రేషన్ బియ్యం అమ్మకోవడం ద్వారా నష్టాలు



ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని పేదలకు ఉచితంగా సరఫరా చేస్తోంది. వీటిని అమ్ముకోవడం ద్వారా వ్యాపారులు, దళారులు ఈ బియ్యాన్ని పాలీస్ పట్టించి సన్న బియ్యంగా మార్చి తిరిగి మార్కెట్లోని వస్తున్నాయి. వీటినే మనం 25 కిలోల బ్యాగ్ రూ.1800 చెల్లింది. కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పోషక విలువలు లేని బియాన్ని తిరిగి ప్రజలకు అంటగడుతున్నారు.

### అందరూ తినే విదంగానే తయారీ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేసి ప్రజలందరూ తినే విధంగా రేషన్ బియ్యాన్ని తయారు చేస్తున్నాయి. ప్రజలు ఇదే విషయాన్ని గుర్తుంచి ఉచితంగా ప్రభుత్వాలు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని అమ్ముకోకుండా సొంతానికి వినియోగించుకుని పోషక విలువలు పెంచుకోవాలని కోరుతున్నారు. రేషన్ బియ్యం అమ్ముకుంటే పోషక విలువలను పోగొట్టుకున్నట్లు కావున ప్రతి ఒక్కరు రేషన్ బియ్యం ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వైభవంగా సీతారామ కళ్యాణోత్సవము



**లక్కిరెడ్డిపల్లె: మార్చి 27 ప్రభాత వార్త**
శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలలో శ్రీ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత శ్రీ ఆంజనేయ స్వామి కళ్యాణోత్సవమును శుక్రవారం గ్రామ ప్రజలు, భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని రామాలయంలో అర్చకులు శ్రీ హరి స్వామి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవమును ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలతో అలంకరించి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని భక్తుల కోలాహలం నడుమ ఘనంగా నిర్వహించారు. పానకం ,వడపప్పు ను స్వామీ వారికి నైవేద్యంగా సమర్పించారు.అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధులలో బాణాసంచ నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు వడపప్పు , పానకం తో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.చింతకుంట వాండ్లపల్లె, కోనంపేట, దిన్నపాడు , మద్దిరేవుల తదితర గ్రామాలలో శ్రీ సీతారామ కళ్యాణం ను నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకమును అందజేసి, దాతల సహకారంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. బాణాసంచా నడుమ బ్యాండు వాయిద్యాల తో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగింపు నిర్వహిం చారు. చెక్కభజన, కోలాట భజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ రామాలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేస్తూ స్వామివారి దర్శనాన్ని కల్పింప చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్య తేజస్సుతో విహరించిన శ్రీరాముడు

**వాల్మీకిపురం మార్చి 27,ప్రభాతవార్త :**
శ్రీ పట్టాభిరాముడి వార్షిక శాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాలుగవ రోజైన శుక్రవారం శేషుడిపై శాంతి స్వరూపుడైన శ్రీరాముడు అధిరోహించి తన దివ్య తేజస్సుతో వాల్మీకి క్షేత్రంలోని మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అంతకుమునుపు ఆలయంలో నిత్య పూజల అనంతరం ఉదయం 9 గంటలకు సర్వభూపాల వాహనంపై సీతారాములు అధిరోహించి తిరుమాడ వీధుల్లో ఊరేగారు. తదుపరి సుగంధ పరిమళాల ద్రవ్యాలతో స్వామివారికి స్నపన తిరుమంజనం సేవ నిర్వహించారు.శ్రీరామనవమి సందర్భంగా విశేష అలంకరణలో ముస్తాబైన సీతారాముల వారికి ఆలయ ప్రాంగణంలోని మండపంలోని ఉంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విశేషాలంకరణలో ముస్తాబైన సీతారాములు బంగారు శేష వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తులను విశేషంగా కట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తితిదే లోకల్ టెంపుల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ సలహాదారు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి కృష్ణమూర్తి, వేద పండితులు కృష్ణ ప్రసాద్ బట్టర్, అధికారులు, వాల్మీకి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వడపప్పు పానకం పంపిణీ

**పులివెందుల మార్చి 27 ప్రభాత వార్త :**



శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని శ్రీరామ హాల్ రోడ్డు నందు సాయి శ్రీ ఫిజియోథెరపీ డాక్టర్ కొంగనపల్లి సాయి కిషోర్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు ప్రజలకు వడపప్పు పానకం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది శ్రీరామ నవమి రోజున సాయి కిషోర్ కుటుంబ సభ్యులు వడపప్పు పానకం పంపిణీ చేయడం జరుగుతూ వస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వడపప్పు పానకం పంపిణీ నిర్వహించా రు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశా రు. ఈ కార్యక్రమంలో మన పల్లి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిశాల నుంచి కోదండ రామునికి పట్టువస్త్రాలు అందజేత

**బద్వేలు అర్బన్, మార్చి 27, ప్రభాతవార్త :**



శ్రీరామనవమిని పురస్కరించుకుని అమ్మవారి శాల నుంచి కోదండ రామాలయంలో జరుగు కళ్యాణ మహోత్సవానికి పట్టువస్త్రాలను ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్నసుబ్బారావు , సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాళం నాగరాజరావు మరియు కమిటి సభ్యులతో కోదండ రామాలయకమిటి సభ్యులకు పట్టు వస్త్రాలు అందించారు. వారికి ఆలయ చైర్మన్ జనార్ధనరావు, సెక్రటరీ నాగేశ్వరరావులు స్వామివారి సన్నిదిలో వారిని సత్కరించి ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన వాడవాడలా శ్రీరామనవమి

ఘనంగా సీతారాముల వారి కళ్యాణం... పెద్ద ఎత్తున వడపప్పు పానకం అన్నదానం...




**మైదుకూరు, మార్చి 27, ప్రభాతవార్త:**
రామా శ్రీరామా రఘురామ అంటూ గ్రామ గ్రామాన వాడవాడలా విద్యుత్ అలంకరణ, పూల తోరణాలు, మామిడాకులు, అరటి తోరణాలతో భక్తులకు కనువిందుగా సీతారాముల వారి అలంకరణతో రాముల వారి ఆలయాల దగ్గర పందిర్లు వేసి సీతారాముల కళ్యాణోత్సవానికి భక్తులకు పెద్ద ఎత్తున ఆలయ పెద్దలు ఆహ్వానం పలికారు. కళ్యాణానికి ముందు భక్తులకు పెద్ద ఎత్తున పానకం వడపప్పు అందజేశారు. భక్తుల నోట రామ మార్గం అనుసరణీయం, రామ నామం స్మరణీయం, రామ పాలన ఆదర్శనీయం,రామ జపం ఎంతో పుణ్యం వస్తుందని అంటూ ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీరాముడు. ఆయన అవతరించిన రోజు, ఆయన కళ్యాణం జరిగిన రోజు మనం శ్రీరామనవమి వేడుకలను ప్రతి సంవత్సరం జరుపుకుంటాం. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన. అలాంటి రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని పెద్దలు కోరారు. మైదుకూరు పట్టణములోని పాతూరిలో వెలసిన పాల రాతి శిల్పాలలో ఉన్న శ్రీరాముల ఆలయ సన్నిధిలో వినాయకుడు, సరస్వతి దేవి నూతన విగ్రహాల ప్రతిష్ట అనంతరం సీతారాముల వారి కళ్యాణం పెద్ద ఎత్తున జరిపించడం జరిగింది. నంద్యాల రోడ్డు శ్రీకృష్ణ దేవరాయలు సర్కిల్ దగ్గర్లో రామాలయం దేవాలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. బద్వేల్ రోడ్డు గాంధీనగర్ లో ఉన్న సీతారాముల ఆలయం నందు భక్తుల సందడితో సీతారాముల కళ్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. అంతేకాకుండా మండలంలోని గ్రామాలలో మున్సిపాలిటీ పరిధిలో అనేకచోట్ల శ్రీరామనవమి పండుగ పెద్ద ఎత్తున ఆలయాలలలో జరుపుకోవడం జరిగింది. హిందువుల పండుగలలో ఏ పండగ అయినా ఒక ప్రత్యేకత ప్రకృతి, మనిషి, జరిగే కాలానికి సంబంధం ఉంటుందని తెలియజేస్తుంది. శ్రీరామనవమి రోజున సమర్పించే వడపప్పు, పానకం కేవలం సాంప్రదాయ నైవేద్యాలు మాత్రమే కాదు, వేసవి తాపం నుండి రక్షణ కల్పించే ఆయుర్వేద, ఆరోగ్య ప్రసాదాలు. బెల్లం, మిరియాలు, అల్లంతో చేసే పానకం తక్షణ శక్తిని, చలువను ఇస్తే, నానబెట్టిన పెసరపప్పుతో చేసే వడపప్పు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇవి శరీరాన్ని చల్లబరిచి, వేసవి వేడి నుండి కాపాడతాయి. చాలా చోట్ల శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల యందు మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం ఉత్సవాల ఊరేగింపు కన్నుల పండుగగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత, హిందూ బంధువులందరూ పాల్గొని జయప్రదం చేశారు. ఆలయాల యందు ఆలయ కమిటీ సభ్యులు పెద్దలు నిర్వహణ ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేయడంతోపాటు భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించారు.

## శ్రీరామనవమి వేడుకల్లో డిసిసి బ్యాంకు చైర్మన్

### విరాళం అందజేసిన సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్ అర్బన్ మార్చి 27 ప్రభాతవార్త :**
శ్రీరామనవమి వేడుకల్లో జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. అలాగే బయన పల్లెలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. శ్రీరాముడి ఆలయంలో కొత్తగా ధ్వజస్తంభ స్థాపనతో పాటు ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నట్లు గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తన వంతు సాయంగా 10,016/ విరాళంగా ఇచ్చారు. ఆలయంలో దర్శనం అనంతరం టిడిపి నాయకులు శివయ్య, భైసాని సురేందర్ రెడ్డి, నాగిరెడ్డి భాస్కర్ రెడ్డి డిసిసి బ్యాంక్ చైర్మన్‌కు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఓబులాపురం రాజశేఖర్, గాజులపల్లి శంకర్‌రెడ్డి, అరవ శ్రీనివాసులు రెడ్డి,ఓబుల రెడ్డి రమణ రెడ్డి, పాలకొండు రాజశేఖర్ రెడ్డి,అశోక్ కుమార్ రాజు,మాచుపల్లి కృష్ణారెడ్డి, సిమెంట్ సుబ్బారెడ్డి, బోవిళ్ళ నరసింహారెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు జహంగీర్ భాష, బిజీవేముల చంద్రశేఖర్‌రెడ్డి, గాజులపల్లి రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాచునూరు చెంచురెడ్డి, ఓబులరెడ్డి శ్రీనివాసులరెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, బ్రహ్మదండు శ్రీనివాసులు, కోటపాటి పెంచలయ్య అందూరు వెంకట సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణం



**నందలూరు, మార్చి 27 ప్రభాతవార్త:**
మండలంలోని ఎగువ కుమ్మరపల్లి కోదండ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా యల్లటూరు శ్రీనివాసరాజు, యల్లటూరు శివరామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పురోహితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. భక్తుల రామనామ స్మరణల మధ్య కళ్యాణం కన్నుల పండుగగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, ఏనుగుల బాలాంజనేయులు, ఆకుల చలపతి, మురళి, శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**వీరపునాయన పల్లి మార్చి 27, ప్రభాతవార్త :**
మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే రామాలయాల నందు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం వైభవంగా సీతారాముల కళ్యాణాలను నిర్వహించారు అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం దప్పు వాయిదాల మధ్య గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## ఆరోగ్యకర జీవనానికి మూలాధారం మంచినీరే



**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 27 ప్రభాతవార్త**
బ్రహ్మకుమారీస్ ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో గాంధీరోడ్డులోని సిఎన్ఆర్ హాస్పిటల్ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రంను శుక్రవారం బికే శాంత, కాసిన నాగ మల్లేశ్వర రెడ్డి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బికె శాంత మాట్లాడుతూ సర్వ మానవాళికి నీరే ప్రధానమని, సర్వ కాలాల యందు మనిషి ఆరోగ్యకర జీవనానికి మూలాధారం మంచినీరు అని, వేసవికాలంలో వచ్చే పలు రకాల వ్యాధుల నుండి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ రోజుకు 4లీ. నుండి 5లీ. వరకు మంచినీరు విధి గా త్రాగాలని సూచించారు. రోజుకు 750లీటర్ల చొప్పున 80 రోజుల పాటు చలివేంద్రానికి సరిపడ పూర్తి మినరల్ వాటర్‌ను కీ.శే. కాసిన నర్సి రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు కె నాగమల్లేశ్వర్ రెడ్డి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వారంలో 2 రోజుల బాటసారులకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఓం శాంతి భవన్ నిర్వాహకులు బి.కె. శాంత తెలిపారు. ఈ సందర్భంగా పాదచారులకు దహర్తులకు మజ్జిగ వితరణ గావించారు.

## కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం



**గోపవరం. మార్చి 27. ప్రభాతవార్త.**
గోపవరం ప్రాజెక్టు కాలనీలో సీతారాముల కళ్యాణం - ఉత్సవ విగ్రహాల అందజే శ్రీరామనవమి సందర్భంగా ప్రాజెక్టు 2 కాలనీలో సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ డైరెక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి గ్రామస్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కాలనీలోని ఆలయానికి తన వంతుగా ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని, రైతులకు పంటలు సకాలంలో పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గోపవరం ఎంపీపీ కొండయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు రామానాయుడు, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతారామ కళ్యాణం

**ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 27 ప్రభాత వార్త**
మైదుకూరు రోడ్లోని ఒరేయ్ పట్టాభిరామ హోల్సేల్ మండి మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా శ్రీ సీతారామ కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండి పాలకవర్గము ప్రెసిడెంట్ ప్రొద్దుటూరు రోషన్,వైస్ ప్రెసిడెంట్ చిన్న దస్తగిరి యాదవ్,మోహన్ రెడ్డి, సెక్రెటరీ రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసులు, ట్రెజరర్ రవీంద్రనాథ్ రెడ్డి, కమిటీ సభ్యులు బాలకృష్ణ యాదవ్, సతీష్ బాబు, కృష్ణారెడ్డి,గురివి రెడ్డి,భద్రయ్య ఎమ్మెల్యే వరదరాలరెడ్డిని రాఘవరెడ్డిని ఘనంగా సత్కరించారు.



## అబ్బరాతి వీధిలో అంగరంగ వైభవంగా సీతా రాముల వారి కళ్యాణం




**బద్వేలు అర్బన్, మార్చి 27 , ప్రభాతవార్త**
మున్సిపాలిటీ పరిధిలోని అబ్బరాతి వీధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం శ్రీ సీతారామస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే సాయంత్రం పుర వీధుల్లో శ్రీ సీతారామ స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలను పొందారు.

## యూపీ స్కూల్ వార్షికోత్సవం



**సిద్ధవటం మార్చి 27 ప్రభాతవార్త**
మండలం మాధవరం గ్రామపంచాయతీలోని పార్వతిపురంలోని విజయభారతి యుపి స్కూల్ 9వ వార్షికోత్సవం సభలో ఏపీ స్టేట్ నూర్ భాషా దూదేకుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు అందరూ శ్రద్ధగా చదువుకొని, ఉత్తీర్ణతలో మంచి రిజల్ట్ చూపించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల సింగిల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్కూల్ యాజమాన్యం బొగ్గడి నాగేశ్వర్ రెడ్డి స్టేట్ డైరెక్టర్‌కు, సింగల్ విండో చైర్మన్‌లకు శాలువా వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండలం ఐటిడిపి అధ్యక్షులు పెగడ హరి ప్రసాద్, మాధవరం వన్ గ్రామపంచాయతీ టిడిపి ప్రధాన కార్యదర్శి మామిళ్ల మురళి రాయలు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ గ్రామాన

## సీతారామ కళ్యాణం..

**బ్రహ్మంగారిమఠం మార్చి 27 ప్రభాతవార్త**
మండలంలో గ్రామ గ్రామాన శ్రీరామనవమి పండుగ వేడుకలను పురస్కరించుకుని సీత రాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డిపల్లి రామాలయం వద్ద యాదాళ్ళ పీరయ్యా కృష్ణమూర్తి, యాదాళ్ల గోవింద్,చిన్న పీరయ్యా, మరియు సుంకు నాగేశ్వర రావు, సుంకు సుబ్బారావు ధర్మపత్ని లతో వారి కుటుంబ సభ్యులు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. పానకం వడపప్పు ను,మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి శ్రీ సీతారామ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపు వెంపటి కోలాటం వేస్తూ,మహాప్రసాద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,భక్తులు విరివిగా పాల్గొన్నారు.



## శ్రీరామనవమి సందర్భంగా చల్లగిరిగెలలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

### - సి.సి. రోడ్డు పనులకు శంకుస్థాపన మాజీ ఎమ్మెల్యే , టిడిపి యువనేత




**బద్వేలు, మార్చి 27, ప్రభాతవార్త**
శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పోరుమామిళ్ల మండలం చల్లగిరిగెల గ్రామంలోని శ్రీ పట్టాభి రామాలయంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆలయంలో మాజి ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి యువనేత రితేష్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామి వారి దర్శనం చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే సందర్భంలో గ్రామస్తుల సౌకర్యార్థం చల్లగిరిగెల నుంచి రామాలయం వరకు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సి.సి. రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బద్వేల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న, రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాధనకారి రంతు, ఎల్ఎస్‌బి డ్యామ్ చైర్మన్ రెడ్డి, కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు సీత వెంకటసుబ్బయ్య, సర్పంచ్ యనమల సుధాకర్, క్లస్టర్ ఇంచార్జ్ కొండా రామకృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామ సుబ్బారావు, రంగసముద్రం ఎంపీటీసీ కల్వకురి రమణ, దమ్మనపల్లి సర్పంచ్ సత్తిరాజు, మంగన పల్లి రమేష్, బోవీళ్ళ అమర్నాథ్ రెడ్డి మరియు ఇతర ముఖ్య కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### కోనేటి కాల్వ వీధిలో

## ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**ప్రొద్దుటూరు అర్బన్ , మార్చి 27, ప్రభాత వార్త :**
స్థానిక కోనేటి కాలువ వీధిలోని రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదినం సంధర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల తలంబ్రాలను శ్రీసీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి మాజీ యంపిపి నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో దుగ్గిరెడ్డి రఘునాథ రెడ్డి దంపతులు, పోతుల రమణ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించగా కళ్యాణానికి అమ్మవారికి తాళిబొట్లు, మెట్టెలు, జంజము పొలిచెర్ల గురప్ప కుటుంబ సభ్యులు అందజేశారు. అనంతరం పాల్గొన్న భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, నాయకులు ఇవి సుధకర్ రెడ్డి, వద్ది బాలుడు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాస ఆచారి, నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, పల్లా శంకర్ నారాయణ, వెంకట కొండయ్య, స్థానిక నాయకులు సుబ్రహ్మణ్యం, ఆర్ గోపి, పుల్లయ్య, బ్రహ్మయ్య, నారాయణ సత్యనారాయణ, నరసింహులు, టైలర్ చంద్ర, కాటం బ్రహ్మం, తలారీ చంద్రశేఖర్, వెంకటేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం



**దువ్వూరు, మార్చి 27, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులోనూ, దువ్వూరుకు సమీపంలోని కోదండ రామస్వామి దేవాలయంలోనూ అలాగే పుల్లారెడ్డి పేటలోని శ్రీ రామాలయం నందు శుక్రవారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆయా దేవాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవాలను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. పురాతన దేవాలయమైన శ్రీ కోదండ రామస్వామి దేవాలయం నందు శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలకు పూజలు, అభిషేకాలు నిర్వహించి అలాగే కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దువ్వూరులోని రామాలయం వీధిలోనూ అలాగే మద్దుపాలెం వీధిలో ఉన్న దేవాలయాల్లో ఆయా గ్రామ పెద్దలు కళ్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. పుల్లారెడ్డిపేటలోని శ్రీ రామాలయం నందు జరిగిన కళ్యాణోత్సవ వేడుకల్లో కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అన్ని చోట్ల కళ్యాణోత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. వీరికి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### కార్యకర్తల సంక్షేమమే

## మా ప్రథమ ప్రాధాన్యత

**పులివెందుల మార్చి 27 ప్రభాత వార్త :**
కార్యకర్తల సంక్షేమమే మా ప్రథమ ప్రాధాన్యత అని కడప జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి తన స్వగృహం నందు ప్రజా దర్బార్ నిర్వహించారు.తన నివాసానికి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడి వారి సమస్యలును తెలుసుకున్నారు.కార్యకర్తలకు గత ఐదు సంవత్సరాల పాలనలో కోవిడ్ వల్ల మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏమి చేయలేక పోయారు అని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి మళ్ళీ అధికారంలోకి వస్తాము అని అపుడు కార్యకర్తల సంక్షేమం కోసం ప్రథమ ప్రాధాన్యత ఇస్తాము అని అధైర్య పడవద్దు అని ఆయన హామీ ఇచ్చారు.

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పులివెందుల పట్టణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మార్కెట్ యార్డ్, భాకరాపురం, నగరిగుట్ట, వేల్పుల గ్రామాలలోని శ్రీరామాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని, ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైభవంగా సీతారాముల కల్యాణం

**పెండ్లిమర్రి, మార్చి 27, ప్రభాతవార్త:**
చీమలపెంట గ్రామంలో శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. యూత్, పెద్దమనుషుల ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే పెండ్లిమర్రిలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు జరిగింది. ఎస్.రామాపురం, గోపలాపురం, కోనాయపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.



## పోరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా రామనవమి వేడుకలు

**ప్రొద్దుటూరు మార్చి 27 ప్రభాతవార్త**
వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జమ్మలమడుగు వైసిపి నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా స్థానిక బొల్లవరం గ్రామంలోని వారి పూర్వీకులు నిర్మించిన రామాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మూలవిరాట్టులను పట్టు వస్త్రాలతో అలంకరించి, ఉత్సవ మూర్తులను అలంకరించి కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కాగా ఈ ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకునే అవకాశం వున్న నేపథ్యంలో పున: నిర్మించాలని పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి చిన్న నాగిరెడ్డి, పోరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పోరెడ్డి భాస్కర్ రెడ్డి, పోరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మరియు వారి కుటుంబ సభ్యులు, బొల్లవరం ప్రజలు పాల్గొన్నారు.

